లాల్‌ దర్వాజా అమ్మవారికి ప్రత్యేక పూజలు

మన్సూరాబాద్‌: బోనాల ఉత్సవాల నేపథ్యంలో లాల్‌ దర్వాజా బోనాల పండుగ సందర్భంగా గాంధీనగర్‌ కార్పొరేటర్‌ పావనీ వినయ్‌కుమార్‌ ఆహ్వానం మేరకు జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌, మన్సూరాబాద్‌ కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి, ఆర్మూర్‌ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి శుక్రవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

బాబా ఆలయంలో జిల్లా జడ్జి పూజలు



చైతన్యపురి: రంగారెడ్డి జిల్లా జడ్జి హర్ష దంపతులు శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు జడ్జి దంపతులకు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ట్రస్ట్‌ కమిటి చైర్మన్‌ శ్యాంకుమార్‌ జడ్జి దంపతులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సాయి ట్రస్ట్‌ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



ఎల్‌బీనగర్‌: నిబంధనలకు విరుద్ధంగా, జీహెచ్‌ఎంసీ అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని హయత్‌నగర్‌ సర్కిల్‌ టౌన్‌ప్లానింగ్‌ ఏసీపీ పావని అన్నారు. బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ పరిధి సెల్ఫ్‌ ఫైనాన్స్‌ కాలనీలో అనుమతులకు లేకుండా ఆదనపు అంతస్తులు నిర్మిస్తున్నట్లు సమాచారం అందడంతో టౌన్‌ప్లానింగ్‌ అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. అదేవిధంగా మన్సూరాబాద్‌ డివిజన్‌, ప్రియదర్శినీకాలనీలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న నిర్మాణాన్ని నేలమట్టం చేశారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్‌ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

ఎల్‌బీనగర్‌: దోమల నివారణకు తీసుకోవాల్సి జాగ్రత్తలపై హయత్‌నగర్‌ సర్కిల్‌ ఎంటామాలాజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం సర్కిల్‌ పరిధిలోని పలు కాలనీల్లో సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రతి డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు తెలియజేశారు. నీటిలో పెరిగే తోక పురుగులే దోమలుగా వృద్ధి చెందుతాయని, వీటి జీవితకాలం 28 నుంచి 30 రోజులు మాత్రమే అయినా, ప్రతి దోమ 3వేల గుడ్ల వరకు పెడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు డ్రైడేగా పాటించి ఇంటి అవరణాలలో నీటి నిలువలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పార్కుల అభివృద్ధికి కృషి

ఎల్‌బీనగర్‌: డివిజన్‌ పరిధిలోని పార్కులను సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన డివిజన్‌ పరిధిలోని శ్రీ పురం కాలనీలోని పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు, కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ దామోదర్‌, ఏఈ నరేందర్‌, కాలనీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, నాయకులు విఠల్‌ రెడ్డి, సికింధర్‌రెడ్డి, నరసింహారెడ్డి, సూర్యవర్ధన్‌రెడ్డి, పద్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, ముత్యంరావు పాల్గొన్నారు.

అక్రమాలకు అడ్డుకట్ట వేయండి

నాగోలు: జీహెచ్‌ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో చెరువులు, పార్కులు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్‌ కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌ కుమార్‌ తదితరులు శుక్రవారం హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ మూసీ పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలు బఫర్‌ జోన్‌లో నిర్మించుకున్న నివాసాల కూల్చివేస్తామని అధికారులు బయపెడుతున్నారని కమిషనర్‌ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ అలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బీజేపీ కార్పొరేటర్లు రాధా ధీరజ్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, రంగనర్సింహగుప్త, ప్రేమ్‌ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌తో బీజేపీ కార్పొరేటర్లు

ప్రపంచ శాంతికి పాటుపడాలి



మాట్లాడుతున్న కేవీఎల్‌

నాగోలు: కార్గిల్‌ యుద్ధవీరుల స్ఫూర్తితో ప్రపంచశాంతి కోసం ప్రతి పౌరుడు పోరాడాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపీఎస్‌ఓ) రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కే.వీ.ఎల్‌ అన్నారు. సంఘం రంగారెడ్డి జిల్లా కమిటీ అధ్యక్షులు తిప్పర్తి మహేష్‌ అధ్యక్షతన శుక్రవారం సరూర్‌నగర్‌ సాగరిక స్కూల్‌లో కార్గిల్‌ 'విజయ్‌దివస్‌'ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేవీఎల్‌ మాట్లాడుతూ యుద్ధం వద్దు శాంతి కావాలని, ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. ప్రపంచంలో యుద్ధాల వల్ల దేశాలు అభివృద్ధికి దూరమవుతున్నాయని, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుతూ మన దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. అనంతరం కార్గిల్‌ అమరవీరులకు నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యులు రఘుపాల్‌, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాచం సత్యనారాయణ, కార్యదర్శి పల్లె వినయ్‌కుమార్‌, అనూష, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలగానె రవికిషోర్‌, నాగేశ్వరప్ప, భిక్షపతి, సమన్వయ ప్రధాన కార్యదర్శి చిత్రం సైదులు, నాయకులు పల్లె వెంకన్న, జీనికుంట్ల లింగయ్య, గట్టిగుండ్ల నర్సింహ, శీన య్య, పల్లె దీప, ఉషారాణి, శ్రీధర్‌, రమేష్‌, పరమేశ్‌, కవిత, ప్రసన్న, రమణ తదితరులు పాల్గొన్నారు. దేశ రక్షణలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై సెమినార్‌ నిర్వహించారు.

జయశంకర్‌ను తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి



రంగారెడ్డి జిల్లా డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న పాండురంగాచారి

నాగోలు: తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమస్ఫూర్తి ప్రదాత, ప్రొఫెసర్‌ జయశంకర్‌ను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ జాతిపితగా అధికారికంగా ప్రకటించాలని ఈ మేరకు అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలని వర్కర్స్‌ పార్టీ ఆఫ్‌ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి అన్నారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర సమితి పిలుపుమేరకు వివిధ సమస్యలపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలో డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అర్హులైన పేదలకు డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లు ఇవ్వాలని కోరారు. స్థానిక ఎన్నికలకు ముందే బీసీ కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్‌ చేశారు. రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలను నివారించాలని, కౌలు రైతులకు సంక్షేమ పథకాలు అందజేయాలని, రైతులందరికీ ఉచిత వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌ వి.రాములు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కొప్పు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

లలితా సహస్రనామ పారాయణం

నాగోలు: సాయినగర్‌ కాలనీలోని మైసమ్మ, పోచమ్మ దేవాలయంలో శుక్రవారం ఆషాఢ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా సహస్ర పారాయణం, గోరింటాకు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్‌ సిద్దాల ఐలయ్య, కమిటీ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్‌, హ్యాండీక్రాఫ్ట్‌ మేళాకు విశేష స్పందన



వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా కమ్యూనిటి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్‌ ఇండియా హ్యాండ్లూమ్‌ అండ్‌ హ్యాండీక్రాఫ్ట్‌ మేళా (ఎగ్జిబిషన్‌ అండ్‌ సేల్‌) కు విశేష స్పందన లభిస్తోంది. మేళాలో కొలువుదీరిన దుస్తులు, ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు వనస్థలిపురం, పరిసర కాలనీల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్‌, డిజైనర్‌, కాంతా వర్క్‌, హ్యాండ్‌ బ్లాక్‌ ప్రింటెడ్‌ లినెన్‌, కలంకారీ, బెంగాల్‌ కాటన్‌, లక్నో చికాన్‌, బనారస్‌ చీరలు, లేడీస్‌ ఫ్యాన్సీ టాప్స్‌, డిజైనర్‌ బ్లౌజెస్‌, ఖాదీ మెటీరియల్‌, వన్‌గ్రామ్‌ గోల్డ్‌ జ్యూవెలరీ, జైపూర్‌ బెడ్‌షీట్స్‌, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, గాజులు, చెప్పులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని మేళా నిర్వాహకులు అక్బర్‌అలీ తెలిపారు. ఈ అవకాశం కొద్దిరోజులు మాత్రమే ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

తల్లీకూతురు అదృశ్యం

నాగోలు: కుటుంబ కలహాల నేపథ్యంలో తల్లీకూతురు అదృశ్యమైన సంఘటన ఎల్‌బీనగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హస్తినాపురం, సంతోషిమాత కాలనీకి చెందిన కదారి నాగరాజు సెంట్రింగ్‌ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. మూడేళ్ల క్రితం అతను శ్రీలతను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఒక కుమార్తె (02) ఉంది. గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం కూడా వారి మధ్య గొడవ జరిగింది. అనంతరం నాగరాజు పని వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చే సరికి భార్య, కుమార్తె కనిపించలేదు. వారి కోసం గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో శుక్రవారం ఎల్‌బీనగర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాగడాల ప్రదర్శన



కాగడాల ప్రదర్శనలో సురేందర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి

మలక్‌పేట: కార్గిల్‌ విజయ్‌ దివస్‌ను పురస్కరించుకుని బీజేవైఎం భాగ్యనగర్‌ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కాగడాల ప్రదర్శన నిర్వహించారు. మూసారంబాగ్‌ చౌరస్తా నుంచి ఆండాళ్‌ నిలయం కమాన్‌ మీదుగా ఎస్‌బీఐ ఆఫీసర్స్‌ కాలనీ టీ–జంక్షన్‌ వరకు కాగడాల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, మూసారంబాగ్‌ కార్పొరేటర్‌ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌ రెడ్డి, మలక్‌పేట కన్వీనర్‌ గజానంద్‌, బీజేవైఎం స్టేట్‌ ట్రైనింగ్‌ సెల్‌ ఇన్‌చార్జి సుధీంద్ర, జిల్లా అధ్యక్షుడు అనుముల భరత్‌కుమార్‌ అమరజవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ ఎక్స్‌ సర్వీస్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు పీఆర్‌కే మూర్తి, వెంకటేశ్వర్లు, మల్లారెడ్డి, మహేందర్‌ రెడ్డి, శ్యామ్‌సుందర్‌, కృష్ణయ్య, గోపాల్‌దాసులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీరని అన్యాయం



ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఎల్‌బీనగర్‌: రాష్ట్ర బడ్జెట్‌లో విద్య రంగానికి తీరని అన్యాయం జరిగిందని, తక్షణమే బడ్జెట్‌ను సవరించి విద్యరంగానికి నిధులు పెంచాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్‌ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యరంగాన్ని చిన్న చూపు చూడటాన్ని నిరసిస్తూ శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్‌ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్‌ల ఊసే లేదన్నారు. గత ప్రభుత్వ బాటలోనే నూతన ప్రభుత్వం కూడా నడుస్తుందని ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలకు నిధులు కేటాయించలేదని తెలిపారు. స్కిల్‌ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని చెప్పిన కాంగ్రెస్‌ ప్రభుత్వం దానిపై స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం విద్య రంగంపై నిర్లక్ష్యం వహిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.